

ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థినులకు మంగళవారం స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో సామాజిక శాస్త్రంలోని ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆహారంలోని అంశాలు, పదార్థాలను వర్గీకరించడం, మిశ్రమాల నుంచి పదార్థాలను వేరు చేసే వివిధ రకాల పద్ధతులు, పాల్యాంతంలోని వెండి పదార్థ పరీక్ష, మాంసకృత్తుల పరీక్ష, కొవ్వుల పరీక్ష, నీటిలో కరిగేవి, కరగనివి, మునిగేవి, తేలేవి, చిలకడం, చేతితో ఏరివేయడం, తూర్పారబట్టడం, ఎగిర బోత, వడపోత, జల్లించుట వంటి అనేక అంశాలపై విద్యార్థులతో ప్రయోగాలు చేయించడం ద్వారా అవగాహన కల్పించారు.

సంక్షేమ బోర్డు కోసం ఎదురు చూపులు

- పథకాలు పునరుద్ధరించాలంటున్న కార్మికులు
- నిలుపుదల చేసిన గత వైసిపి ప్రభుత్వం
- కూటమి సర్కారు స్పందించేనా.?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సిఐటియు ఆధ్వర్యంలో కేంద్రంతో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు చట్టం అమలు కోసం భవన నిర్మాణ కార్మికులు ఎదురుచూపులు చూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ బోర్డుని పూర్తిగా నిర్వీర్యం చేసింది. కార్మికుల శ్రమతో సెస్సు రూపంలో వసూలు చేసిన రూ. వందల కోట్ల నిధులను ఇతర కార్యకలాపాలకు మళ్లించి అన్యాయం చేసింది. కేంద్రంతో పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా కాలరాసింది.



సంక్షేమ బోర్డును నిలుపుదల చేస్తూ 2021 సెప్టెంబరులో మెమో 1214ను తీసుకొచ్చింది. దీంతో వేలాదిమంది నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 53 రకాల భవన నిర్మాణ పనులు చేస్తూ దాదాపు 5 లక్షల మంది కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

అనేక పోరాటాలు

గత వైసిపి ప్రభుత్వం లోపాభూయిష్టమైన విధానాలను అనుసరించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించడంతో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు అనేక రూపాల్లో ఆందోళనలు చేశారు. ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద ధర్నాలు చేసి వినతి పత్రాలు అందజేశారు. సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకు మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తూ దఫదఫాలుగా నిరసనలు నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పరిహారాలను తక్షణం విడుదల చేయాలంటూ డిమాండ్లు చేశారు. దేశ వ్యాప్త సమ్మె, చలో కలెక్టరేట్లు, మంత్రుల ఇళ్ల ముట్టడి వంటి కార్యక్రమాల ద్వారా పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కార్మికులను బలవంతంగా ఈడ్చి జైల్లో అరెస్టు చేయడం వంటి ఘటనలు జరిగాయి. అయితే ఈలోపు గత ప్రభుత్వం పదవీకాలం ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. భవన నిర్మాణరంగ కార్మికులు గత ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. తమ సమస్యలను పరిష్కరిస్తుందని చంద్రబాబు ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా సంక్షేమ బోర్డు విషయంలో నేటికీ స్పష్టత లేకుండా ఉంది. సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటూ తేల్చడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఏప్రియల్ 1 నుంచి సంక్షేమ బోర్డు పథకాల అమలును ప్రభుత్వం పరిశీలిస్తోందని కార్మికులు, సిఐటియు నాయకులకు అధికారులు చెప్పుకొస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు నిలుపుదల చేసి తీవ్ర అన్యాయం చేసిందని ఎన్నికల్లో కూటమి నాయకులు ఆరోపించడమే కాకుండా తమతో ఓట్లేయించుకున్నారని కూటమి నేతలపై కార్మికులు మండిపడుతున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించలేదని విమర్శిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిర్మాణ కార్మికుల సమస్యలను, పెండింగ్లో ఉన్న క్లైములను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీను నిలబెట్టుకోవాలి

రూ.10 లక్షల నిర్మాణ వ్యయం దాటిన భవనాల నుంచి, ప్రాజెక్టుల నుంచి ఒక శాతం లేబర్ సెస్ పేరుతో వసూలు చేసిన రూ.2 వేల కోట్లు సంక్షేమ బోర్డులో మూలుగుతున్నాయి. నిత్యం ప్రమాదాల్లో, అనారోగ్యాలతో చనిపోతున్న కార్మికుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. సంక్షేమ బోర్డులో మూలుగుతున్న నిధుల నుంచి చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడానికి 8 నెలల్లో ఒక్కరోజు కూడా సమయం కేటాయించలేదు. తక్షణమే సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలి.

-సిహెచ్.రాజ్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి.



తునిలో ధర్నా నిర్వహిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ఎల్ఐసిలో విదేశీ పెట్టుబడుల బిల్లుపై నిరసన

ఎల్ఐసిలో నూరు శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లును వ్యతిరేకంగా ఎల్ఐసి నిరసన చేపట్టారు. ఎల్ఐసి ఉద్యోగుల సంఘం ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం భోజన విరామ సమయంలో పెద్దాపురం, తుని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు ధర్నాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - పెద్దాపురం, తుని

పెద్దాపురం ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ బీమా రంగంలో ప్రపంచ స్థాయిలో భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసి) ప్రథమ స్థానంలో ఉందన్నారు. గతంలో ఎల్ఐసిలో 25 శాతం నుంచి 74 శాతానికి విదేశీ పెట్టుబడులను అనుమతించారన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా ఎల్ఐసిలో నూరు శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ముసాయిదా రూపొందించి పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టేందుకు సిద్ధం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎల్ఐసి ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. దేశ ఆర్థిక పటిష్టతకు రక్షణగా ఉన్న ఎల్ఐసిని రక్షించుకోవాల్సిన బాధ్యత భారత పౌరులందరిపై ఉందన్నారు. ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.వేణుగోపాలరావు, ఎం.రామకృష్ణ, సహాయ కార్యదర్శి వై.సునీల్‌కుమార్, కోశాధికారి ఎంవి.దత్త, ఎవిఎస్.సోమరాజు, సాయికృష్ణ, జోత్స్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే తుని బ్రాంచ్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.సాయిబాబా, కెఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్థిక రంగంలో బలంగా ఉన్న ఎల్ఐసి బీమా రంగాన్ని బలహీన పరిచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయానికి పాల్పడుతోందని, దీనిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దాపురంలో ధర్నా నిర్వహిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రకృతి సేద్యంతో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పి.తిమ్మాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యం తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సేద్య పద్ధతులను, సమీకృత సేంద్రియ వ్యవసాయం, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం, వరి పంటను ఆశించు చీడపీడలు వాటి నివారణ పద్ధతులను ఆయన వివరించారు. నూతన వ్యవసాయ పద్ధతులలో డ్రోన్ ఆవశ్యకత, గ్రూపుల ద్వారా ఆర్ఎస్‌కెల పరిధిలో సబ్సిడీపై డ్రోన్‌ల సరఫరా, మొదలైన వాటిపై కూలంకషంగా రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మాధవి, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకుల పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు, రైతులు పాల్గొన్నారు. అనంతరం క్షేత్ర సందర్శన చేసి వరి పంటను పరిశీలించారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి విజయ్‌కుమార్

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని శారీరక వైకల్యం కలిగిన బాలల సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంఇఒ విఆర్‌కెచౌదరి తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరఫీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 4 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు కల్గిన శారీరక దివ్యాంగులు, మెదడుకు పక్షవాతం ఉన్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులలో ఈ ఫిజియోథెరఫీ పట్ల అవగాహన పెంచాలన్నారు. ఈ అవకాశాన్ని వికలాంగ పిల్లల తల్లీదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరఫిస్టు డాక్టర్ అపర్ణ, ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్రపతికి లేఖలు

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారించడం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖలు రాయనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మావతి, ఎరుబండి చంద్రవతి తెలిపారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ లకు గ్రాడ్యుటీ చెల్లించాలని, 4వ తరగతి ఉద్యో గులుగా క్రమబద్ధీకరించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా బిజెపి ప్రభుత్వం బేఖాతరు చేస్తుందన్నారు. దీనిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు రాష్ట్రపతి కలగజేసుకుని సుప్రీంకోర్టు తీర్పుని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖల ఉద్యమాన్ని చేపడు తున్నట్లు చెప్పారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో ప్రతీ ఏడాది కోతలు పెడుతుందని, దీనివల్ల పేద, దళిత, బహుజన పిల్లలకు, గర్భిణీలకు అందే పౌష్టికాహారం దూరమవు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా మట్టి ఖర్చులు మినహా ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ, వేతనాలు ధరలకు అనుగుణంగా పెంచాలని, యాప్‌ల పనిభారన్నీ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు దాడి బేబీ, రాజేశ్వరి, ఎస్తేరురాణి, వీరమణి, సుజాత, జ్యోతి, బుల్లెమ్మ, మేరీ సమాధానం, నీరజ, ఎస్.రాణి, శుభరత్నం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నగర వనాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం

జిల్లాలో నగర, పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన నగరవనాలు ఏర్పాటుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రక్కన ఉన్న ప్రదేశాన్ని రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. భూ రీకార్డులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో నగర, పట్టణ ప్రాంతాల్లో జిల్లాలో నగర వనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పనులకు సంబంధించి రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రభుత్వ భూములు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. ఎకో టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని ఆదేశించారు. అనంతరం ఆయన గొల్లప్రోలు మండలం చందుర్తి గ్రామ పరిధిలోని ఆక్రమిత భూములను పరిశీలించారు. గత 30 ఏళ్లుగా సుమారు 450 ఎకరాల ప్రభుత్వ భూమిని చెందుర్తి, కొడవలి గ్రామాలకు చెందిన బిసి, ఎస్‌సి సామాజికవర్గాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో ఆ భూమి ప్రభుత్వ భూమిగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ భూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పేదల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఉన్న అవకాశాలపై అధికారులతో ఆయన చర్చించారు. భవిష్యత్తులో స్థాపించబోయే పరిశ్రమలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. అనంతరం ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జెడ్డంగి అన్నవరం వరకు నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రహదారిని పరిశీలించారు. రమణయ్యపేటలోని ఎంపిపి ఆదర్శ పాఠశాల వద్ద రహదారి నిర్మాణానికి అనుసరిస్తున్న విధానాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ ఎస్ మల్లిబాబు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు, పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సర్వే అధికారులు పాల్గొన్నారు.


పిఠాపురం డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎంఎల్‌సి ఎన్నికలకు మరో నామినేషన్

రెండుకు చేరిన నామినేషన్ల సంఖ్య

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మరో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ములకల శ్రీనివాస్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సహాయ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల మూడో తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్ల సంఖ్య రెండుకు చేరింది. ఇప్పటి వరకూ నామినేషన్లు వేసిన వారంతా ఇండిపెండెంట్ అభ్యర్థులే. ఎంఎల్‌సి ఎన్నికల బరిలో నువ్వా..నేనా అంటూ తలపడుతున్న పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు ఇంకా నామినేషన్లు వేయలేదు. ఆరు, ఏడు తేదీల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

కెరీర్‌పై సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీలో కెరీర్ కౌన్సెలింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులకు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మవిజ్ సిఇఒ అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ మెడికల్ కోడింగ్ ఫార్మా కోవిజిలెన్స్, క్లినికల్ రీసెర్చ్, క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్, కమిటీ కౌన్సిలింగ్ కోఆర్డినేటర్ ఎస్.అమల, అధ్యాపకులు బి.రాజు, డాక్టర్ బిఎన్‌బి. వైదేహి, సాయి ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అజీమ్

రెడ్ క్రాస్ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వైడి.రామారావును మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. సన్మాన గ్రహీత రామారావు మాట్లాడుతూ రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ పదవి ద్వారా తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజా సూరిబాబురాజు, శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ పెద్దాపురం ఛైర్మన్ సిహెచ్.విజయ్ ప్రకాష్, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


వైడి.రామారావును సత్కరిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

'ఉపాధి'కి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీకి కనీసం రూ.2 లక్షల కోట్లను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం సిహెచ్. వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కూలీలందరకి ఉపాధి కల్పించాలంటే కనీసం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఏటా రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తున్నారని, ఇది చాలా దుర్మార్గమని, ఇలా అయితే కూలీల బ్రతుకుల్లో ఏం మార్పు వస్తుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టి.ఆదిలక్ష్మి బి.పద్మ, జి.వెంకటలక్ష్మి, ఎం.అనసూయ, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మెయిన్ రోడ్‌లో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి గుణశేఖర్, నాయకులు శ్రీను, నరేష్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల పరిశుభ్రత

ప్రజాశక్తి - పెద్దాపురం


పట్టణ పరిధిలోని పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల పరిశుభ్రతా పనులను మంగళవారం చేపట్టారు. పార్కులో పరిశుభ్రత పనులు, చెత్త తొలగింపుతోపాటు ఈ పార్కుల్లో ఉన్న వాకింగ్ ట్రాక్కులను పరిశుభ్రం చేశారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ పనులను నిర్వహించారు.

'ప్రజ్ఞ' వికాస పరీక్షలు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల వ్యాప్తంగా పలు పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజ్ఞ వికాస పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.వరహాలు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటమే కాదు, విద్యార్థుల మేథస్సును పెంపొందించే దిశగా ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు. స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోల రాంబాబు మాట్లాడుతూ 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అచ్చిరాజు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రాణాలకు ప్రాధాన్యత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రయాణం చేసే క్రమంలో ప్రతీ ఒక్కరూ ప్రాణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని నగర పాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. మంగళవారం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో రహదారి భద్రతా మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ కె.శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాహనదారులు వేగం కన్నా ప్రాణాలకు ప్రాధాన్యత ఇచ్చి తమ ప్రయాణాలు కొనసాగించాలని సూచించారు. నగరంలో అనేక రహదారులపై ఆటోలు, ఇతర వాహనాలు ఇష్టానుసారంగా కాకుండా క్రమపద్ధతిలో నిలుపుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నివారణకు అనేక చర్యలు చేపట్టామని, వాహనదారులు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సకాలంలో సమీప ఆసుపత్రులలో చేర్పించి చికిత్స అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో బాధితులకు సాయం చేస్తున్న వారిపై ఎటువంటి ఒత్తిడులు ఉండవని, సాక్ష్యాలు, కోర్టులు తదితర అంశాలపై నిబంధనలు పూర్తిగా రద్దు చేశారని, ప్రమాదం జరిగిన వెంటనే బాధితునికి చేసే సాయంపై ప్రభుత్వం తగిన పారితోషికం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు హరనాథ్‌రెడ్డి, మురళీకృష్ణ, లక్ష్మీ కిరణ్, గౌరీశంకర్, సాయిబాబా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన


రైతులతో మాట్లాడుతున్న వల్లు రాజబాబు

సాగునీరు అందించాలని రైతుల మొర

ప్రజాశక్తి - తాళ్లరేవు

పంట ప్రారంభ దశలోనే సాగునీరు లేక ఎండిపోతున్న పొలాలకు నీరందించి పంటను కాపాడాలని రైతులు కోరారు. మంగళవారం మండలంలోని జార్జిపేట సాగు భూముల రైతులు ఎండిపోతున్న పొలాల వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగుకు సిద్ధమైతే ప్రారంభంలోనే నీరు లేక పొలాలు ఎండిపోయాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. జార్జిపేట ప్రాంతంలో ఇప్పటికే సుమారు 20 ఎకరాలు సాగునీరు లేక ఎండిపోయిందని రైతులు వాపోయారు. అనంతరం రైతులు ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ శివారు ప్రాంతాల భూముల రైతులకు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ సాగునీటి ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు ముఖం చాటేసారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంత భూములకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణం 7వ వార్డులోని గణేష్ నగర్ రైలు గట్టు పక్కన ఒక మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం కడియాల పార్వతి అనే మహిళ ఇంటిముందు టులెట్ బోర్డు చూసి ఇల్లు చూపించాలని ఒక వ్యక్తి అడిగాడు. దీనితో ఇంట్లో ఉన్న కడియాల పార్వతి ఇల్లు చూపిస్తుండగా ఆమె మెడలో గొలుసు లాక్కుని పారిపోయాడు. గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి ఉన్నాడు. తాడు లాగుతున్న సమయంలో పార్వతి కింద పడిపోగా ఆమెను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, ఎస్ఐ నాగేశ్వరరావు విచారణ చేపట్టారు. నాలుగు కాసులు బంగారు గొలుసు లాక్కుని పారిపోయినట్లు పార్వతి పోలీసులకు వివరించింది. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ నాగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

అచ్చన్నపాలెంలో భారీ చోరీ

45 కాసుల బంగారం, రూ.2లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం గ్రామంలో భారీ చోరీ జరిగింది. వట్టికూటి రామారావు ఇంట్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి సుమారు 45 కాసులు బంగారం, రూ. 2 లక్షల నగదు అపహరించుకుపోయారు. సిఐ నక్క శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. అడిషనల్ ఎస్పి(క్రైం) అర్జున్ తెలిపిన వివరాల మేరకు రామారావు కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దొంగలు వెనుక ఉన్న గది నుంచి ఇంట్లోకి చొరబడ్డారన్నారు. బంగారు నగలు, నగదుతో ఉడాయించారన్నారు. ఇప్పటికే క్లూస్ టీమ్ ఘటనా ప్రాంతంలో ఆధారాలు సేకరించిందన్నారు. పాత నేరస్తుల వివరాలు, సిసి కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నామనారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు ఇళ్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట డిఎస్పి జి.దేవకుమార్, సిఐలు ఎన్.శ్రీనివాస్, నాయక్, ఎస్ఐ ఎం.సోమరాజు, సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామ శివారు పేకాట ఆడుతున్న సమాచారంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న గుల్ల అబ్బాయి, మర్రెడ్డి నూకరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు

కూటమి అభ్యర్థి విజయానికి ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట, కాకినాడ రూరల్, పెద్దాపురం

కూటమి పార్టీల పట్టభద్రుల ఎంఎల్సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోసం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని బచ్చు ఫౌండేషన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఆయన కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలో పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల సమాయత్త సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్నికల పరిశీలకులు సీతం రాజ్‌సుధాకర్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నియోజకవర్గ టిడిపి కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి పాల్గొని మాట్లాడారు. బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. పెద్దాపురం పట్టణంలోని పలు పాఠశాలల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వేలాయుధం అధ్యక్షత వహించి మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి నివారణపై విద్యార్థులతో పాటు అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉండడానికి ఇటువంటి అవగాహనా కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యరాలు జాప్రియా క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ వ్యాధి నివారణ, అందరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. అందరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వివిఎల్‌పి.రాజు, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఎ.జయవీరన్, తాతారావు, రాధా కుమారి, బాలరత్నదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య బీమా పథకంపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో నిరామయ ఆరోగ్య బీమా పథకంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెంటర్ ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్, ఫిజియోథెరపిస్ట్ విజయ దుర్గాదేవి మాట్లాడుతూ నిరామయ ఆరోగ్య బీమా పథకం వికలాంగులకు ఆరోగ్య సేవలు అందించే పథకం అన్నారు. ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మేధోపరమైన వైకల్యాలు, బహుళ వికలాంగులు ఉన్న వ్యక్తులకు ఈ పథకం అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సుశీల, కె.మహేశ్వరీ, డి.వీరవేణి, దుర్గ, తాతారావు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కాకినాడ



బాధితునితో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

దళిత యువకులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న బాధితుడిని మంగళవారం కెవిపిఎస్ యూనియన్ నాయకులు పరామర్శించారు. జరిగిన దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని మహాలక్ష్మి నగర్ మేకల కబేలా సమీర్ పేట మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఉండ్రాజవరపు నాని ఆదివారం రాత్రి తన ఇంటికి వెళ్తుండగా రోడ్డుపై మద్యం సేవిస్తున్న అగ్నికుల క్షత్రియ కులానికి చెందిన కొంతమంది నానిని దగ్గరకు పిలిచి దాడి చేశారని అన్నారు. కులం ఏమిటని ప్రశ్నించిన వారు అదే కులం పేరుతో దుర్భాషలాడుతూ మేకల కబేల వీధిలో నడిపించుకుని తిప్పారన్నారు. అక్కడే పడుకోబెట్టి కాళ్లు చేతులు పట్టుకుని యాక్టివా బండితో కాళ్లపై నడిపించడం దారుణమన్నారు. ఎంతగా ప్రాధేయపడిన వదలకుండా కొట్టుకుంటూ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారన్నారు. రక్తపు గాయాలతో ఉన్న నానిని పోలీసులు ప్రభుత్వ హాస్పటల్ కి తరలించగా డాక్టర్ల ఆపరేషన్ చేయాలని సూచించారన్నారు. దీనిపై టౌన్ ఎస్ఐతోపాటు, డిఎస్‌పిని కలిసి జరిగిన సంఘటనను వివరించారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధితునికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేష్‌కుమార్, కె.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.సత్యానందం, కె.పద్మనాభం, ఎన్..రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై చర్చా గోష్ఠి

ప్రజాశక్తి - కాకినాడ



విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందిస్తున్న నాయుడు, తదితరులు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ద్రవ్య బడ్జెట్‌పై చర్చ గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సమకాలిక ఆర్థిక, రాజకీయ సామాజిక విషయాలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి ఇటివల ప్రవేశ పెట్టిన కేంద్ర ద్రవ్య బిల్లుపై చర్చలో సమగ్ర విశ్లేషణ చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన గగన, హర్షిత, ప్రణిత, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన నరసింహకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కామర్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఆన్సర్ అలీ, అధ్యాపకులు నరసింహారావు, స్రవంతి, రమణి, గుల్షన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికోవర్‌లో కేన్సర్ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి వైద్యులు

ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా నగర పరిధిలోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో అన్నిరకాల కేన్సర్లకు చికిత్స అందించే అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అనుభవజ్ఞులైన డాక్టర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరికీ సమానమైన, వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన కేన్సర్ సంరక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. కేన్సర్‌పై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, కేన్సర్ వస్తే మరణం తప్ప చికిత్స లేదనేది అపోహ మాత్రమేనని అన్నారు. మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ కేన్సర్‌ని నిర్మూలించడానికి అనేక రకమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రషోబ్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్స కేవలం వైద్య పరంగా కాకుండా, భావోద్వేగ ఆర్థిక పరమైన మద్దతుతో కూడినదని చెప్పారు. రేడియేషన్ అంకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ ప్రదీప్‌భాస్కర్ న్యూరో సర్జన్ డాక్టర్ చందు లింగోల మాట్లాడారు. ఈ సందర్భంగా కేన్సర్ వ్యాధిని జయించిన వారిని సత్కరించారు.

రేషన్ వాహనం రాక ఇబ్బందులు

ప్రజాశక్తి - సామర్లకోట



వాహనం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

సామర్లకోటలో రేషన్ సరుకులు అందక పలు ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండియు ఆపరేటర్లపై వచ్చిన ఆరోపణలతో పలు ప్రాంతాల్లో రేషన్ వాహనాలు సేవలు నిలిపి వేసినట్లు తెలుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో రేషన్ వాహనాలు రాకపోవడంతో రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందడం లేదు. స్థానిక బలుసుల పేటలో మంగళవారం రేషన్ కార్డులతో లబ్ధిదారులు వాహనం వచ్చే పాయింట్ వద్ద పడిగాపులు పడ్డారు. సరుకులను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. దీనిపై ఎంఎస్ఒ కమలకుమారి ప్రజాశక్తితో మాట్లాడుతూ బలుసుల పేట, బ్రౌన్ పేట ఎండియు వాహనాల ఆపరేటర్లపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కేసులు నమోదు చేయడం జరిగిందని, కేసులు పరిష్కారం అయ్యే వరకూ లబ్ధిదారులు రేషన్ షాపులకు వెళ్లి తీసుకోవాలని సూచించారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి - సామర్లకోట, శంఖవరం

స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో ఇఒ బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అభిషేక పండిట్ బృందం బిక్కిన రాజశేఖర్ దంపతులు పీటలపై ఆశీనులు కాగా కన్నుల పండుగ నిర్వహించారు. పూజల అనంతరం యాత్రికులకు ప్రసాద వితరణ చేశారు. అలాగే అన్నవరం వీర వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అధికారులు ఘనంగా రథసప్తమి వేడుకలు నిర్వహించారు. కొండపైన సత్యదేవుని వార్షిక కళ్యాణ వేదిక వద్ద దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ ఐవి.రోహిత్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వైదిక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున యాత్రికులు తరలివచ్చారు. యాత్రికులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పలు చోట్ల అన్నదానం

ప్రజాశక్తి - రౌతులపూడి, పెద్దాపురం

రౌతులపూడి మండలంలోని బలరామపురంలో 8వ సప్తహ మహోత్సవాల సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో సర్పంచ్ పైలా సీత, ఎంపిటిసి సభ్యులు సోమ రౌతు రవి, మాజీ సర్పంచ్ పైలా పైడ్రాజు, నాయకులు కోటిపల్లి నాగు, కాకి సీతారామస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం పాండవుతల మెట్టపై సూర్యనారాయణ మూర్తి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. పెద్ద బ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆదిత్య విద్యాసంస్థల కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ మాడపాటి భాస్కర్‌చంద్రారెడ్డి, భాస్కర రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తోటకూర గంగాధర్, జి.ప్రకాశరావు, గంగాధరరావు, పప్పల శ్రీనివాస్, యాదవ సంఘ నాయకులు అనుముల సత్యనారాయణ, పంచగట్ల సత్యనారాయణ, గోవిందు, దుర్గా లక్ష్మి, నాగదేవి తదితరులు పాల్గొన్నారు. మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ సాధన ఎంతగానో దోహదం చేస్తుందనిజిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ అన్నారు. శివజ్యోతి యోగ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఆన్‌లైన్ యోగ పోటీల్లో కాకినాడ జిల్లా క్రీడా మైదానం యోగ క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచి అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా స్థానిక నాగమల్లితోట డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటి యోగ హాల్లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనవరి 24 తేదీ నుంచి 26వ తేదీ వరకు బెంగుళూరుకు చెందిన శివజ్యోతి ఆన్‌లైన్ యోగ కార్యక్రమంలో జిల్లా నుంచి యోగ క్రీడాకారులు 30 మంది పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచారని అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను యోగా కోచ్ జిఎన్ఎస్‌విఎస్. సత్యనారాయణరాజును డిస్ట్రిక్ట్ అడిషనల్ ఆఫీసర్ సత్యనారాయణను ప్రశంసించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేస్తున్న కారణంగా ఈనెల 5, 6 తేదీలలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిఎసిల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆక్రమణ భూములపై జడ్‌పిటిసికి వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జార్జిపేట ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జడ్‌పి భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని ప్రభుత్వం పేదలకు అందజేయాలని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్‌ను కోరారు. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, విప్పర్తి శ్రీనివాస్, పెట్ల సూర్యనారాయణరాజు, విప్పర్తి శ్రీనివాస్, పలివెల అర్జునరావు, పువ్వల డేవిడ్ రాజు, శీలి రాజు, పలివెల రవి పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - గొల్లప్రోలు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మల్లిబాబు

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు పరిశీలించారు. కార్యాలయంలో బూజులు పట్టి, మౌలిక సదుపాయాలు లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డ్ భద్రపరుచు బీరువ, కంప్యూటర్, ప్రింటర్ కొత్తవి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవివి.సత్య నారాయణ, డిటి సౌమ్య, ఆర్‌డిటి ఎస్కే మస్తానీ, ఆర్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.